క్లుప్తంగా

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

జమ్మలమడుగు : జమ్మలమడుగు నియోజక వర్గ అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సి.ఆదినారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జమ్మలమడుగులో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న అయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో నాలుగు వేల నియోజకవర్గాలు ఉన్నాయి. అందులో అభివృద్ధి చెందిన మొదటి నాలుగు నియోజకవర్గాలలో జమ్మలమడుగు ఉంటుందన్నారు. ఇప్పటికే జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ఫ్యాక్టరీ, అదాని సిమెంట్ ఫ్యాక్టరీ, దాల్మియా విస్తరణ పనులతో పాటు పదివేల మెగావాట్ సోలార్ , విండ్ పవర్ నిర్మాణం, రాజోలి జలాశయం నిర్మాణం, ఎస్‌ఆర్‌బీసీ పనులు ప్రారంభమవుతాయన్నారు. అభివృద్ధి కోసం నేను ధోబీగా మారి పనిచేస్తా అన్నారు. వల్లభనేని వంశీ అనే జైలు పక్షిని పరామర్శించడం కోసం వెళ్లిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారుల పట్ల బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. తమ కుటుంబంపై వ్యక్తిగతంగా విమర్శలు చేసిన మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని ఉద్దేశించి కూడా పరుషంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, తదితులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలి

వల్లూరు (చెన్నూరు) : ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని బ్యాంకు అధికారులు పొదుపు సంఘాల మహిళలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ సహకారంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరాలు జరిగిన తక్షణమే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కెనరా బ్యాంక్ ఎఫ్‌ఎల్‌సీ సి.వీరప్రసాద్, వెలుగు సీసీ శంకర్‌రెడ్డి, హెడ్స్ సంస్థ అధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్, కళాజాత బృందం కె.ఎస్. రూరల్ మీడియా ప్రతినిధులు కళాజాత ద్వారా మహిళా సంఘాలను ఉపాధి హామీ కూలీలను గ్రామ ప్రజలను సైబర్ క్రైమ్స్ పైన అవగాహన కల్పించారు.

దివ్యాంగులకు అన్నదానం

పులివెందుల రూరల్ : అర్.తుమ్మలపల్లె గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ దివంగత తుమ్మల మహేశ్వర రెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని వారికుటుంబ సభ్యులు ముద్దనూరు రోడ్డులోని పవర్ ట్రాక్టర్ షోరూంలో దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు పోట్లదుర్తి విద్యార్థిని ఎంపిక

ఎర్రగుంట్ల : పోట్లదుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సౌమ్యప్రియ నేషనల్ మీన్స్‌మెరిట్, స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.పద్మనాభరాజు తెలిపారు. విద్యార్థినికి ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగు సంవత్సరాలు ప్రభుత్వం ఈ స్కాలర్‌షిప్‌ను అందిస్తుందన్నారు. ఈ ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక కావడానికి కృషి చేసిన ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారన్నారు.

కషాయం, జిగురు అట్టలతో ఎంతో ఉపయోగాలు

పులివెందుల రూరల్ : కషాయం, జిగురు అట్టలను ఫీల్డ్‌లో పెట్టుకోవడంవల్ల ఎంతో ఉపయోగాలు ఉన్నాయని ఏఓ నాగలక్ష్మి ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. బుధవారం చంద్రగిరి గ్రామంలోని రైతు మహమ్మద్‌బాషా అరటి పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని పంటలను పరిశీలించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా పంటలు బాగా వచ్చేలా సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఏటీఎం మోడల్ వల్ల ఆర్థిక ఇబ్బంది లేకుండా ఉంటుందని, కావున రైతులందరూ ఏటీఎం మోడల్‌ను ప్రోత్సహించాలన్నారు. అనంతరం ద్రవ జీవామృతం డెమో చూపించి వాటి గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏ రాఘువ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి

ఎర్రగుంట్ల : జువారీ సిమెంట్ పరిశ్రమలోని క్యాంటీన్‌లో విధులు నిర్వర్తిస్తున్న శ్రీసాగర్ (48) అనే కార్మికుడు గుండెపోటుతో మృతి చెందినట్లు యర్రగుంట్ల పోలీసులు తెలిపారు. శ్రీసాగర్ భార్య సుకంతి పదహాయర్‌తో కలిసి గత1 7 సంవత్సరాలుగా జువారి పరిశ్రమలోని క్యాంటీన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి కుమార్తె ఉంది. ఉదయం క్యాంటీన్‌లో విధులు నిర్వర్తిస్తుండగా గుండెపోటు వచ్చి కుప్ప కూలిపోయి మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దు

పులివెందుల రూరల్ : వాహనదారులు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దని అర్బన్ సీఐ నరసింహులు తెలిపారు. బుధవారం పట్టణంలోని పాత బస్టాండు సమీపంలో వాహనాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇస్తున్నారని, అలా ఇవ్వడంవల్ల వారికి ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రధాన రహదారిలోని ఫుట్ పాత్‌లపై రోడ్డుకు అడ్డంగా తోపుడు బండ్లు, వాహనాలు ఉంచరాదన్నారు.

ఉపాధి కూలీలపై అక్కసు!


చిలేకాంపల్లెలో పనులకు వచ్చి హాజరు వేయించుకుంటున్న ఉపాధి కూలీలు

చక్రాయపేట : ఏపీఓ ఇబ్బందులు పెడుతున్నారని ఉపాధి హామీ పథకం కూలీలు వాపోతున్నారు. ఉపాధి హామీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి వస్తున్న ఆనవాయితీని పక్కన పెట్టి తన మార్కును ఆయన అమలు చేస్తున్నారని ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెలితే.. ఇటీవల చిలేకాంపల్లె ఉపాధి కూలీల పట్ల ఆయన వ్యవహరించిన తీరు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడు రోజుల క్రితం ఏపీఓ ఉపాధి పనుల పరిశీలన నిమిత్తం చిలేకాంపల్లె గ్రామానికి వెళ్లారు. అక్కడ కూలీల హాజరుపట్టిని పరిశీలించి ఎవరి పేరు మస్టర్‌లో ఉంటే వాళ్లే పనికి రావాలని భార్య పేరున భర్త, భర్త పేరున భార్య ఎలా వస్తారని కూలీలను ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకం ప్రారంభం నుంచి ఇలాగే పనులు చేసుకుంటూ వెళుతున్నాం ఎప్పుడూ ఏ అధికారి కూడా ఇలా చెప్పలేదని కూలీలు తెలిపారు. కూలీల సమాధానంతో ఏపీఓ అసహనానికి గురయ్యారు. ఇందుకు చిర్రెత్తిన ఆయన మీరు వైసీపీ వాళ్లా అంటూ మాట్లాడారని కూలీలు పేర్కొంటున్నారు. వైసీపీప్రభుత్వంలో గాని ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వం లోగాని గ్రామంలోని నేతలు గాని ఫీల్డ్ అసిస్టెంట్‌లు గాని కూలీల జోలికి రాలేదు. సక్రమంగా అందరూ పనులు చేసుకోండి అని చెబుతుంటే మీరు వచ్చి వైసీపీ అని మాట్లాడతారేంటని కూలీలు ఆయన్ను నిలదీశారు. పైగా కూలీల వద్దకు వచ్చే సరికి మస్టర్ ఎవరి పేరుంటే వాళ్లే అని చెబుతున్న నీవు కాంట్రాక్టర్లు వస్తే ఎలాంటి ప్రశ్నలు వేయకుండా బిల్లులు ఎలా ఇస్తున్నావని నిలదీశారు. దీంతో ఆయన అలాకాదు ఇలా కాదు అంటూ అక్కడి నుంచి వెనుతిరిగి వెళ్లి పోయాడు. ఏపీవో తీరుతో గ్రామాల్లో కక్షలు కూడా పెరిగేలా ఉన్నాయని కొందరు కూలీలు పేర్కొంటున్నారు.

మధ్యవర్తుల చేతికే మస్టర్లు

ఉపాధి కూలీల మస్టర్లు ఎఫ్‌ఏల కంటే మధ్యవర్తుల చేతికే వస్తాయని కొందరు ఎఫ్‌ఏలు అంటున్నారు. పనులు కల్పించాలని కూలీలు తరపున వెళ్లి మూడు రోజుల ముందుగా డిమాండ్ పత్రం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇందులో పొరపాటున ఎవరిదైనా పేరు మస్టర్లలో ఎక్కక పోతే దానికి తలనొప్పులు వస్తున్నాయని ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఏపీవో దృష్టికి తీసుకెళితే వచ్చే వారంలో సరిదిద్దు కోండి ఇప్పుడు ఎక్కించడానికి వీలుకాదని ఖరాఖండీగా చెబుతాడని ఎఫ్‌ఏలు కాకుండా మరెవరైనా దళారులు వెళితే దగ్గరుండి పేర్లు ఎక్కించి మస్టర్లు చేతికి ఇచ్చి పంపుతాడని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

అలాంటిది ఏమీ లేదు

కూలీలు చెబుతున్నట్లుగా అలాంటిది ఏమీ లేదని ఏపీవో రవి తెలిపారు. మస్టర్లలో పేర్లు ఎవరివి ఉంటే వారు వస్తే బాగుంటుందన్నాను. కాని పనులకు రావద్దని చెప్పలేదన్నారు. వైసీపీ తెలుగుదేశం అని కూడా తాను అనలేదన్నారు.

ఈ విషయమై ఎంపీడీవో బి.రాజశేఖర్‌రెడ్డిని అడుగగా.. చిలేకాంపల్లె గ్రామంలో ఉపాధి కూలీలు, ఏపీవో మధ్య ఏమి జరిగిందో తన నోటీసుకు రాలేదన్నారు. ఈ విషయంపై తాను కూడా విచారిస్తానని ఎంపీడీవో వివరించారు.

దళారి వ్యవస్థ వద్దు.. ఆప్కాస్ ముద్దు


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

జమ్మలమడుగు : మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల మధ్య దళారుల వ్యవస్థ లేకుండా అప్కాస్ ద్వారనే నడపించాలని సీఐటీయూ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు ఏసుదాసు, నాగన్నలు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తే ఉద్యమం తప్పదన్నారు. గతంలో ప్రైవేట్ ఏజెన్సీలు ఇష్టరాజ్యంగా కార్మికులను ఇబ్బందులకు గురి చేయడంతోపాటు సకాలంలో జీతాలు అందించకుండా వారి పట్ల నిర్లక్ష్యధోరణితో వ్యవహరించారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 45 వేల మంది అప్కాస్ ద్వారా కార్మికులు పనిచేస్తున్నారన్నారు. అప్కాస్ ద్వారా పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులను దృష్టిలో పెట్టుకుని వారినిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యూరియా దొరకక రైతుల అగచాట్లు

సింహాద్రిపురం : రైతులకు భూమి సారవంతం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సబ్సిడీతో యూరియా అందిస్తుండేది. దీంతో రైతులు భూమి సారవంతం కొరకు నత్రజని ఉండటంతో తెలివిగా వాడుతూ భూమి సారవంతం కోసం సబ్సిడీతో వస్తుండటంతో విరివిగా వాడేవారు. దీంతో భూములు సారవంతమై పంటలలో దిగుబడులు బాగా వస్తుండేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి పులివెందులలో ఎక్కడే కానీ యూరియా దొరకడంలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి యూరియా రైతులకు సబ్సిడీతో అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని రైతులు వాపోతున్నారు.

ప్రతి ఒక్కరికీ లక్ష్యం ఉండాలి

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరికీ ఒక లక్ష్యమనేది ఉండాలని, ఆ లక్ష్యం చేరుకోవడానికి కృషి చేయాలని ఇరిగేషన్ శాఖ ఈఈ రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని శ్రీసరస్వతి విద్యా మందిరం పాఠశాలలో బుధవారం ఆయన పీబీసీ కెనాల్ వాటర్ సిస్టం గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ లక్ష్యం చేరుకోవడానికి ఎటువంటి కృషి చేయాలో కొన్ని ఉదాహరణలతో పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పేదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్ఠు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతో పాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఇలా అయితే ఏమి న్యాయం చేస్తారు ?

చక్రాయపేట : సబ్సిడీ రుణాల్లో మంజూరు తక్కువ దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయి. ఇలాగైతే కూటమి నేతలు బీసీలకు ఎలా న్యాయం చేస్తారని జడ్పీటీసీ శివప్రసాదరెడ్డి మండిపడ్డారు. మండలానికి మొత్తం 27 సబ్సిడీ రుణాలు మంజూరైతే 400 పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో అధికారులు ఎవరిని సబ్సిడీ రుణాలకు ఎంపిక చేస్తారన్నారు. ఒకవేళ కూటమి నేతలు సిఫారసు చేయాలన్నా మండల వ్యాప్తంగా ఉన్న నాయకులు వారి గ్రామాల్లో ఎవరికి న్యాయం చేస్తారని ప్రశ్నించారు. మంజూరైన 27 కూడా చివరకు ఎవరికీ ఇవ్వరని ఆయన తెలిపారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


వేంపల్లె : భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు బాలాజిలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో సంఘం నేతలతో కలిసి ఈనెల 24న కడప కలెక్టరేట్ వద్ద చేసే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే అందుకు సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి పార్టీలు బోర్డు పునరుద్ధరణ కోసం హామీ ఇచ్చాయని, 8 నెలలైనప్పటికీ ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ ఈ విషయాన్ని గమనించాలన్నారు. ధర్నా విజయవంతం చేసేందుకు కార్మికులందరూ ఐక్యతగా పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కోశాధికారి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు దస్తగిరి, ఆంజనేయులు, రవి, సిద్ధయ్య, వెంకటేష్, అంజీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం


స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

వేంపల్లె : క్రీడల ద్వారా విద్యార్థులకు మానసిక ఉల్లాసం లభిస్తుందని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. బుధవారం ట్రిపుల్ ఐటీ స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులకు పలు సలహాలు సూచనలు చేశారు. క్రీడలతో క్రమశిక్షణ నైపుణ్యాన్ని పెంపొందించవచ్చునని, క్రీడల ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చునన్నారు. చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. ప్రతిభతో తమ గుర్తింపు సాధించాలన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి రవికుమార్, అకాడమిక్ డీన్ రమేష్, డిఎస్ డబ్ల్యూ కోఆర్డినేటర్ వెంకటేష్, ఫిజికల్ డైరెక్టర్లు పి.వి. రమణారెడ్డి, బాలయ్య, శంషాద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత

పులివెందుల రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ పీడీ సి.లక్ష్మీదేవి తెలిపారు. బుధవారం కొత్తపల్లె, చంద్రగిరి, మల్లికార్జునపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకుని కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. టీచర్లు సమయపాలన పాటించాలన్నారు. టీచర్లకు 125 రోజులపాటు జ్ఞాన జ్యోతిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీ టీచర్లందరూ హాజరై ప్రీస్కూల్‌పైన అవగాహన పెంచుకుని ప్రీస్కూళ్లలో పిల్లల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ శ్రీలత, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నగర పంచాయతీకి ఇద్దరు శాశ్వత ఉద్యోగులు

కమలాపురం : నగర పంచాయతీలో పనిచేసేందుకు ఇద్దరు శాశ్వత ఉద్యోగులు నియమించబడ్డారు. కమలాపురం నగర పంచాయతీ ఏర్పడి దాదాపు 4 ఏళ్లు కావస్తున్నప్పటికి పనిచేస్తున్న సిబ్బంది అంతా ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్ పై వచ్చిన వారే. అయితే బుధవారం సీనియర్, జూనియర్ అసిస్టెంట్లుగా వచ్చిన వారు శాశ్వత ఉద్యోగులు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 21 శాశ్వత పోస్టులను కమలాపురం నగర పంచాయతీకి మంజూరు చేసింది. ఇందులో భాగంగా నగర పంచాయతీ మొదటి శాశ్వత ఉద్యోగిగా జీవీఎస్ కళ్యాణ్ కుమార్ సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రొద్దుటూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. అలాగే మైదుకూరు నుంచి పదోన్నతి పై జూనియర్ అసిస్టెంట్‌గా ఇషాక్ బాబు వచ్చారు.

‘సాక్షి’ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ


వల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

వల్లూరు : సాక్షి దిన పత్రిక ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా అందజేస్తున్న ఉచిత స్టడీ మెటీరియల్‌ను వల్లూరు, చెన్నూరు మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం పంపిణీ చేశారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. పెద్దపుత్త జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరరెడ్డి, గంగాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రఘునాథరెడ్డి, ఏపీ మోడల్ స్కూల్‌లో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డేనియల్, కేజీబీవీలో ప్రిన్సిపాల్ నజీమున్నీసా చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులందరికీ సాక్షి ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా వున్న ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలి


మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : రైతులందరూ తప్పని సరిగా రైతు గుర్తింపు సంఖ్యకు నమోదు చేసుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం చిన్నచెప్పలిలో జరిగిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో వారు పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. రైతులందరూ తమ పట్టాదారు పాసు పుస్తకాలు లేదా 1బి, అడంగల్, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డుతో లింక్ అయిన సెల్‌ఫోన్‌తో ఆర్‌ఎస్‌కే లకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేసుకోవాలన్నారు. రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య కేటాయించబడుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పని చేస్తుందన్నారు. భూ ఆధార్ రైతు పథకాలైన పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా పంటల రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు పథకాలను నేరుగా పొందే వీలుంటుందన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పర్యటించి వేరుశనగ, నూగు, కొర్ర పంటలను పరిశీలించారు. సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. కంది పంటను సీడ్ కొరకు వారి పరిధిలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. కొర్ర పంటకు ఆకుమచ్చ తెగులు ఆశించిందని, నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో వీఏఏ సుప్రియ, రైతులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీకి వేతనాలను పెంచండి


ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ నాయకులు

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ ఉద్యోగులకు వేతనాలను పెంచాలని కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ నాయకుడు నజీర్ హుసేన్ కోరారు. బుధవారం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తాకు కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ తరపున జీతాలు పెంచాలంటూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో జాయిన్ అయిన కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీకి ఉద్యోగంలో చేరే సమయంలో రూ.25 వేలు ఇవ్వడం జరిగిందని, కాంట్రాక్టు ఫ్యాకల్టీగా 7 ఏళ్ల నుండి ఉద్యోగం చేస్తున్నా, ఇప్పటివరకు ఆర్జీయూకేటీ పైసా కూడా జీతం పెంచలేదన్నారు. టీడీపీ పాలనలో కాంట్రాక్టు ఫ్యాకల్టీగా చేరారనే కారణంతో గత వైసీపీ ప్రభుత్వం జీవో నెంబరు 110ని అమలు చేయమని చెప్పడం జరిగిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలవుతున్నా 110 జీవోను అమలు చేయలేదని వాపోయారు. జీవో 110 ప్రకారంగా బేసిక్ పేమెంట్ రూ.33 వేలతోపాటు యాన్యువల్ ఇంక్రిమెంట్ రూ.1000 కలిపితే కాంట్రాక్టు ఫ్యాకల్టీ ఉద్యోగులకు రూ.39 వేలు జీతం రావాల్సి ఉందని తెలిపారు. కూటమి ప్రభుత్వం కాంట్రాక్టు ఫ్యాకల్టీని గుర్తించి ఫిబ్రవరి మాసం నుంచైనా జీతాలు పెంచి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. దీనికి స్పందించిన డైరెక్టర్ కుమారస్వామి గుప్తా ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి కాంట్రాక్టు ఫ్యాకల్టీలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

దేవస్థాన స్థలం ఆక్రమణకు గురి కాకుండా చూడండి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న దేవస్థాన మాజీ చైర్మన్, తదితరులు

వేంపల్లె : పాపాఘ్ని నది అవతలి ఒడ్డున ఉన్న శ్రీవృషభాచలేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన స్థలం ఆక్రమణకు గురి కాకుండా చూడాలని దేవస్థాన మాజీ చైర్మన్ దుంపాల ఎద్దుల కొండ్రాయుడు, మాజీ ధర్మకర్త పి.వి.రమణ, విశ్వ హిందు పరిషత్ సభ్యులు కోరారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉన్న తహసీల్దార్ హరినాథ్‌రెడ్డిని వారు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎద్దుల కొండ ఆనుకొని ఉన్న పాపాఘ్ని నది ఒడ్డున వెలుగోటి సుబ్బయ్య అనే వ్యక్తి తన భూమి వరకే కాకుండా చుట్టూ ప్రక్కల ఉన్న దేవాలయ స్థలాన్ని ఆక్రమించుకున్నాడన్నారు. దీంతో ప్రతి ఎడాది జనవరి 1న, సంక్రాంతి, ఉగాది పండుగలతోపాటు మెట్ల ఉత్సాహం, బ్రహ్మోత్సవాలు జరుగుతున్నప్పుడు వేలాది మంది భక్తులు ఎద్దుల కొండపైకి వస్తారని, ఈ క్రమంలో అక్కడికి వచ్చే భక్తులకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఆక్రమణకు గురి చేసిన వ్యక్తికి ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదన్నారు. అలాగే పండుగ రోజుల్లో స్వామి వారి రథం వచ్చేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. గతంలో పసుపులేటి సుబ్బారావు అనే భక్తుడు దేవస్థానానికి రస్తా కోసం భూమిని ఉచితంగా ఇచ్చారని, రస్తాను, భూమిని అంత ఆక్రమించుకుని కంచెను ఏర్పాటు చేసుకోవడంతో దేవస్థానానికి వచ్చే భక్తులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. కాబట్టి ఆక్రమణకు గురైన స్థలాన్ని, కంచెను తొలగించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు హరి ప్రవీణ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.సుష్మా, విశ్వ హిందు పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు


కమలాపురంలో దరఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేస్తున్న బ్యాంకర్లు


ఎర్రగుంట్ల మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు వచ్చిన లబ్ధిదారులతో కిక్కిరిసిన కార్యాలయం

కమలాపురం : మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు 85 మంది హజరయ్యారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పగడాల జగన్నాథ్ సమక్షంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు కమలాపురం ఏపీజీబీ, క్రాస్ రోడ్డు ఏపీజీబీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఎస్‌బీఐ బ్యాంక్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మున్సిపాలిటికి 35 యూనిట్లు మంజూరు కాగా, 85 మంది దరఖాస్తుదారులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు కమీషనర్ తెలిపారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : రాయితీ రుణాల కొరకు దరఖాస్తు చేసుకొన్న దరఖాస్తు దారులకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ అధ్యక్షతన ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 130 మంది దరఖాస్తు దారులు హాజరయినట్లు ఆయన తెలిపారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : 197 మంది అభ్యర్థులు బుధవారం ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ సయ్యదున్నిసా తెలిపారు. 14 పంచాయతీలలో బీసీ, కాపు రుణాలకోసం 270 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ తీసుకున్న రుణాలు కట్టగల్గుతారనే నమ్మకం కలిగితే అటువంటి వారికి సబ్సిడీ రుణాలను ఇవ్వడం జరుగుతుందన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బ్యాంకుల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 30 యూనిట్లు మంజూరవ్వగా 353 మంది రుణాలకు దరఖాస్తులు చేసుకోగా.. 252 మంది హాజరయ్యారని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో మండల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ పద్మనాభ రెడ్డి, సింహాద్రిపురం ఏపీజీబీ బ్యాంక్ ప్రతినిధి మధు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం బీసీ, ఈబీసీ రుణాల కోసం ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 18 బీసీ, 3 ఈబీసీ రుణాల కోసం 250 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వీరికి వివిధ బ్యాంకుల అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూల కోసం వచ్చిన లబ్ధిదారులకు ఆయా బ్యాంకు మేనేజర్లతో కలసి మున్సిపల్ కమిషనర్ శేషఫణి, మెప్మా టీఎంసీ నాగేంద్ర, మున్సిపల్ మేనేజర్ పుల్లయ్యలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 316 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోగా 255 మంది హాజరు అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ మేనేజర్ జ్యోతి, ఎస్‌బీఐ అధికారి మధుసుధన్, హెచ్‌డీఎఫ్‌సీ మేనజర్ వెంకటర్, మేనేజర్ ధీరేంద్రనాథ్‌లు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బీసీ రుణాలకు సంబంధించి లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. 428 మంది దరఖాస్తులు చేసుకోగా, ఇందులో 236 మంది ఇంటర్వ్యూలకు హజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో చిలంకూరు ఏపీపీజీ బ్యాంకు, కెనర బ్యాంకు, ఏపీజీబీ పోట్లదుర్తి, ఎస్‌బీఐ ఎర్రగుంట్ల శాఖలకు చెందిన మేనేజర్లు హజరు అయినారు.

ఇంటర్వ్యూలలో గందరగోళం

పులివెందుల టౌన్ : బీసీ కార్పొరేషన్ రుణాలకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరిగాయి. అధికారులు సరైన వసతులు సమకూర్చకపోవడంతో గందరగోళ వాతావరణం ఏర్పడింది. దీంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అక్కడ తాగునీటి వసతి కూడా కల్పించకపోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు అవస్థలు పడ్డారు. కార్పొరేషన్ కింద 48 యూనిట్లు మంజూరు కాగా, వీటి కోసం 603 దరఖాస్తులు వచ్చాయి. ఈ రుణాలకు సంబంధించి దరఖాస్తుదారులకు వివిధ బ్యాంకుల అధికారుల ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ఎస్‌బీఐ 250, కెనరా బ్యాంక్ 210, ఏపీజీబీ 100, యూనియన్ బ్యాంక్‌లలో 120 మంది రుణాలు పొందేందుకు దరఖాస్తులు చేసుకున్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఉన్న వైఎస్ఆర్ సభా భవనంలో బుధవారం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. మండలానికి 38 యూనిట్లు మంజూరైనప్పటికీ 806 మంది దరఖాస్తులు చేసుకోవడంతో ఇంటర్వ్యూలు చేసేందుకు ఆయా బ్యాంకు అధికారులకు వీలు లేకుండా పోయింది. లబ్ధిదారులు జిరాక్స్ కాపీలను అధికారులకు ఇచ్చి వెను తిరిగి వెళ్లిపోయారు. అవగాహన రాహిత్యంతో ఇంటర్వ్యూలు జరపడంతో గందరగోళంగా మారిందని దరఖాస్తుదారులు వాపోతున్నారు. అధికారులకు జిరాక్స్ కాపీలు ఇచ్చేందుకు ఎగబడ్డారు. ఎవరి కన్నీళ్లు తుడవడానికీ ఈ సబ్సిడీ రుణాలు అని దరఖాస్తుదారులు అంటున్నారు. అయితే ఏ పథకానికి ఎవరూ అర్హులన్న వాటిపై అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమైనట్లు స్పష్టంగా కనపడుతున్నది.